# వ్యర్థప్రయాస

(గల్పిక)

అవును! విమలనూ విశ్వబ్రహ్మాన్నీ వేరుచేసింది నేనే!

అందులో నే నేమీ దగా చెయ్యలేదు. మొదట ఇద్దరికీ చెప్పిచూశాను! నలభై ఏళ్ళనుంచీ ప్రపంచం చూస్తున్నాను, నామాట వినమన్నాను. ఒక తె బాలవితంతువూ, రెండో వాడు విశ్వబ్రాహ్మణ కుర్రాడూ. ఇద్దరికీ ఎట్లా పొత్తు కలుస్తుంది?

విశ్వబ్రహ్మం ఇక్కడ కాలేజీలో చదివి ఫస్టుమార్కులు తెచ్చుకుంటున్నాడని అక్కడ తండ్రి అనుకుంటున్నాడు. ఇక విమలతండ్రి సంగతి అడగనే అక్కర్లేదు—తన కుమార్తె పదహారోయేటకూడా చంటిపిల్ల అనే!

ఈ ఇద్దరూ రోజూ సాయంకాలంపూట బీచిలో కూర్చుని ప్రేమించుకుంటున్న సంగతి విమల తండ్రికీ విశ్వబ్రహ్మం తండ్రికీ తప్ప మిగతా ప్రపంచాని కంతకీ తెలుసు.

"నేను విశ్వబ్రాహ్మణ్నేమిటి? నాకు కులంలేదు. నేను విమలకుమల్లేనే మాట్లాడతాను, విమల తిన్న అన్నమే తింటాను, విమలే నా కులమూ, మతమూ, ప్రాణమూ, సమస్తమూనూ;" అని లెక్చరు దంచాడు విశ్వబ్రహ్మం.

"నేను వితంతువు నేమిటి? నాకు పెళ్లే కాలేదు. నా కొక్కడే భర్త—విశ్వబ్రహ్మం!" అన్నది విమల, అజ్ఞానంవల్ల ద్విగుణీతమైన సాహసంతో. విశ్వబ్రహ్మం తండ్రికి వెంటనే ఒక ఉత్తరం రాసిపారేసి విమల తండ్రికి ఒకచిన్న లెక్చరివ్వటంతప్ప నాకు గత్యంతరం లేకపోయింది.

ఆ ఇద్దరి బాలహృదయాలూ వేధించటం నాకు కష్టం గానేఉంది. ముందు రాబోయే పెద్ద బాధతో పోలిస్తే దాని స్థానే వచ్చిన యీచిన్నబాధ యెంత? అది వాళ్లెరగరు.

ఒకరినొకరు మరిచి పోవటానికి ఒకవారం గడువిచ్చాను. విశ్వబ్రహ్మం స్థితి మరీఅన్యాయంగా ఉండటంచూసి వారం నెల చేశాను. విశ్వబ్రహ్మం తెప్పరిల్లుకో లేదు. విమల చిక్కి సగమయింది. కాని ఇద్దరూ ఒకరినొకరు చూసుకోటంలేదు.

సగం చచ్చిన ప్రాణుల్ని చూస్తే నాకుభయం. నడుము విరిగి ఎంతకూ ప్రాణం పోకుండా గిలగిలలాడే ఆ కుర్రాళ్ళ ప్రేమనడుము మీద మరో దెబ్బ వెయ్యక తప్ప లేదు.

"చూశావా, విశ్వబ్రహ్మం?" అన్నాను."విమల అప్పుడే నిన్ను మరిచిపోయింది. అప్పుడే ఆ కేశవరావుతో సినిమా లకు వెళుతున్నది. నేను చెప్పలా?"

విశ్వబ్రహ్మం అంతదైన్యంలోనూ ఆత్రంగా, "విమల వాణ్ణి ప్రేమించదు. వాడిమీద పగ తీర్చుకుంటుంది. అంతే! ఎట్లా గైనా ఆపాలి. మీరే ఆ పిల్ల హృదయం చితగపొడిచారు" అని లబలబ లాడాడు. నేను లక్ష్యం చెయ్యలేదు.

"చూశావా, విమలా; విశ్వబ్రహ్మం పెళ్లాడటానికి పిల్లను చూడబోతున్నాడు. నేను చెప్పలా!" అన్నాను.

"అయ్యయ్యో!అతనిమనసుమీరేవిరిచేశారు.ఎవతెనోం పో నిలువునతీస్తాడు.ఎట్లాగైనా అతను పెళ్లాడకుండాఆపాలి!"

తరవాత మూడు రోజులకు విమలా విశ్వబ్రహ్మమూ కలిసి లేచిపోయినారు, పాండిచ్చెర్రి వెళ్ళారని తెలిసింది.

చెప్పవచ్చిం దేమంటే నాశ్రమంతా వృథా అయింది.